క్లుప్తంగా

వితరణ



గ్రంథాలయానికి అందజేసిన ర్యాక్స్

డెంకాడ: మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయానికి డెంకాడకు చెందిన యువత రెండు ఐరన్ ర్యాక్స్‌ను బుధవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మహేష్ మాట్లాడుతూ, గ్రంథాలయం అభివృద్ధికి యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు.

'సరోజ' పోస్టర్ విడుదల



సరోజ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీతం కాలేజీ డైరెక్టర్ డాక్టర్ శశిభూషణ్, పల్సర్ బైక్ రమణ

విజయనగరం అర్బన్: జానపద గాయకుడు పల్సర్ బైక్ రమణ నూతనంగా రూపొందించిన 'సరోజ' ఆల్బమ్ పోస్టర్‌ను స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశిభూషణ్ మాట్లాడుతూ, పల్సర్ బైక్ రమణ కళాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నాడని తెలిపారు. పట్టుదల, కృషి, శ్రమ ఉంటే మంచి విజయాలు సాధించవచ్చునని చెప్పారు. అనంతరం పల్సర్ బైక్ రమణ ఆల్బమ్‌లోని పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో పల్సర్ బైక్ రమణ, కొరియోగ్రాఫర్ రితిక్, కళాశాల వివిధ అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెలవుల్లోగా పనులు పూర్తి చేయండి

- జేసీ మయూర్ అశోక్

బొండపల్లి: మనబడి నాడు–నేడు రెండో విడతలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను వేసవి సెలవులు ముగిసి, పాఠశాలలు పునః ప్రారంభించే నాటికి పూర్తిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. మండలంలోని గిట్టుపల్లి, బొండసింగిపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో చేపడు తున్న నాడు–నేడు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బోడ సింగిపేట స్కూల్‌కు రూ.7,32,997 మంజూరు కాగా ఇంత వరకు రూ.5,29,392 ఖర్చు చేసి వివిధ పనులు చేసి నట్లు చెప్పారు. గిట్టుపల్లి పాఠశాలకు రూ.3,19,000 నిధులు కేటాయించగా రూ.2,95,000 ఖర్చు చేసినట్లు తెలిపారు. మిగిలిన పనులను స్కూళ్ల ప్రారంభం నాటికి పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంఈఓ బూసి నాయుడు, బొండపల్లి హైస్కూల్ హెచ్‌ఎం టి.సన్యాసిరాజు ఉన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల పరిశీలన

బొండపల్లి: మండలంలోని రాచకిండాం, చామలవలస గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీల (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు)ను ఈఓపీఆర్డీ సీహెచ్.సుగుణాకరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. గ్రీన్ అంబాసిడర్లు రోజూ ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యూ పీసీలకు తరలించాలని చెప్పారు. కేంద్రాల్లో చెత్తతో సేంద్రియ ఎరువు, వర్మీకంపోస్టు తయారు చేసి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు.

నేడు వేపాడలో నేత్ర వైద్యశిబిరం

వేపాడ: మండల కేంద్రం వేపాడలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు క్యాంపు కో–ఆర్డినేటర్ జోగారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుందని, కంటి పరీక్షలు చేసి అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించి ఆపరేషన్‌లు చేయనున్నట్టు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులను వెంట తీసుకురావాలని సూచించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

జామి: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో చీపురుపల్లి వ్యవసాయశాఖ ఏడీ పి.కోటేశ్వరరావు, జామి ఏఓ కిరణ్‌కుమార్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. నిల్వలు, ధరల పట్టిక, బిల్ బుక్‌ల నిర్వహణ తదితర అంశాలపై దుకాణాల నిర్వాహకులకు అధికారులు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వివాదాస్పద భూమి పరిశీలన

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి రెవెన్యూ పరిధిలోని వివాదాస్పద భూమిని బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్ బుధవారం పరిశీలించారు. సుమారు 35 సెంట్లలోని మామిడి మొక్కలను కొంతమంది తొలగించారని ఫిర్యాదు అందడంతో పరిశీలించామని ఆయన చెప్పారు. ఈ భూమికి సంబంధించిన వివాదంపై కొద్ది రోజుల క్రితం కొంత మంది వ్యక్తులపై కులదూషణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైద్య రంగానికి ప్రాధాన్యం

- ఎనిమిది ఆస్పత్రుల స్థాయిని పెంచిన సర్కారు
- మూడు ఆస్పత్రుల్లో 50 పడకల నుంచి 100 పడకలకు పెంపు
- మరో ఐదు ఆస్పత్రుల్లో 30 నుంచి 50 పడకలకు పెంపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్:

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగ అభివృద్ధికి ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే 'నాడు – నేడు'లో భాగంగా ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో భాగంగా ప్రజలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందిస్తున్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేయించుకున్న వారికి, చికిత్స తీసుకున్నవారికి ఆరోగ్య ఆసరా పథకం కింద భృతి కూడా ఇస్తున్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది నేరుగా ప్రజల ఇళ్లకు వెళ్లి సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో పేద ప్రజలు ఎక్కువగా చికిత్స పొందే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా జిల్లాలో పలు ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల (సీహెచ్‌సీ) స్థాయిని పెంచింది. 30 పడకలున్న ఆస్పత్రులను 50 పడకలకు.. 50 పడకలున్న ఆస్పత్రులను 100 పడకలకు పెంచారు. పెంచిన స్థాయికి అనుగుణంగా సిబ్బందిని కూడ ప్రభుత్వం నియమించింది.



ఎస్. కోట ఏరియా ఆస్పత్రి

ఎనిమిది ఆస్పత్రుల స్థాయి పెంపు :

జిల్లాలో ఎనిమిది ఆస్పత్రుల స్థాయిని తాజాగా పెంచారు. ఎస్.కోట ఏరియా ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచారు. అదేవిధంగా గజపతినగరం ఏరియా ఆస్పత్రి, రాజాం ఏరియా ఆస్పత్రుల్లో పడకల సంఖ్య 50 నుంచి వందకు పెంచారు. బాడంగి సీహెచ్‌సీలో 30 పడకలను 50కి పెంచారు. అలాగే బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల, భోగాపురం ఆస్పత్రుల్లో పడకల స్థాయిని 50కి పెంచారు.

నిర్మాణంలో ఉన్న భవనాలు..

స్థాయి పెంపునకు అనుగుణంగా ఆస్పత్రుల్లో భవన నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. అదనపు వార్డులు నిర్మిస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో భవనాల శ్లాబులు కూడా పూర్తయ్యాయి. మరికొన్ని ఆస్పత్రుల్లో భవన నిర్మాణాలు శ్లాబు దశలో ఉన్నాయి. భవన నిర్మాణాలకు సుమారుగా రూ.150 కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోంది.

సిబ్బందిని కూడా నియమించాం..

వైద్య విధాన్ పరిషత్ పరిధిలో ఉన్న 8 ఆస్పత్రుల స్థాయిని ప్రభుత్వం పెంచింది. 30 నుంచి 50 పడకలకు, 50 నుంచి 100 పడకలకు ఆస్పత్రుల స్థాయిని పెంచారు. స్థాయిని అనుసరించి సిబ్బందిని కూడా నియమించాం. అదనపు భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఆగస్టు నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం ఉంది.

–డాక్టర్ బి. గౌరీశంకర్, జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి

జీవన శైలిలో మార్పుల వల్లే వ్యాధులు

- ఎన్‌సీడీ వైద్యాధికారి గాడి మురళీకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

విజయనగరం ఫోర్ట్: జీవనశైలిలో మార్పు వల్లే బీపీ, సుగర్ వంటి వ్యాధులు వస్తున్నాయని ఎన్‌సీడీ వైద్యాధికారి గాడి మురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా రోగులకు హైపర్ టెన్షన్ (బీపీ) పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో 50 మందిలో ఒకరికో , ఇద్దరికో బీపీ వచ్చేదని.. ప్రస్తుత పరిస్థితుల్లో పది మందిలో ఇద్దరు,ముగ్గురికి బీపీ ఉంటోందన్నారు. శారీరక వ్యాయమం లేకపోవడం, ఉప్పు, కారం, మసాలా ఎక్కువగా తినడం, మద్యపానం, పొగతాగడం, ఖైనీ, గుట్కాలు వంటి ఎక్కువగా తినడం వల్ల బీపీ వచ్చే అవకాశం ఉందన్నారు. జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, నిద్రలేమి వల్ల కూడ బీపీ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ ఎస్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన అరటి పంట



పెదవేమలిలో దెబ్బతిన్న అరటి పంట

గంట్యాడ: మండలంలో మంగళవారం ఈదురుగాలులతో వర్షానికి పలు గ్రామాల్లో అరటి పంట నేలకొరిగింది. పెదవేమలి, చంద్రంపేట, తదితర గ్రామాల్లో 10 ఎకరాల్లో పంట దెబ్బతింది. గెలలతో ఉన్న అరటి చెట్లు ఈదురుగాలులకు నేలకొరగడంతో నష్ట పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

జామి: మండలంలోని కలగాడలో గ్రామదేవత పరదేశమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు, ఎడ్ల పరుగు ప్రదర్శన ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. ఉత్తరాంధ్ర సూపర్ లీగ్ మహిళా కబడ్డీ పోటీలు మంగళవా రం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుతురులో నిర్వహించగా...విశాఖపట్నం, అనకాపల్లి, గరివిడి, నెల్లిమర్ల, శ్రీకాకు ళంనకు చెందిన 5 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జట్టు విజేతగా నిలవగా, ద్వితీయస్థానంలో అనకాపల్లి జట్టు, తృతీయస్థానంలో నెల్లిమర్ల జట్టు నిలిచాయి. విజేత జట్టుకు రూ.15వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. బుధవారం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో 10 జతల ఎడ్లు పాల్గొన్నాయి. నెక్కనివాని పాలెంకు చెందిన ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.12వేలు, వావిలపాడుకు చెందిన ఎద్దులు ద్వితీయస్థానంలో నిలిచి రూ.10 వేలు నగదు బహుమతి గెలుచుకున్నాయి.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని డి.తాళ్లవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల వల్ల ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ, గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకువచ్చారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు వంటివి అందించడంతో పాటు పంటసాగుపై సలహాలు, సూచనలు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు ద్వారా సుందరంగా మార్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్, షూలు, యూనిఫారాలు అన్నీ ప్రభుత్వమే అందిస్తోందని తెలిపారు. పొదుపు సంఘాల మహిళలకు విడితలవారీగా రుణమాఫీ చేస్తున్నట్టు చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్‌లు తోరోతు త్రిమూర్తులు, సువ్వాడ రమేష్, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి మెరుగైన సేవలు

- 48 గంటల్లో వీధి దీపాల మరమ్మతులు పూర్తి చేయాలి
- పారిశుధ్య నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించాలి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

నగరాభివృద్ధికి మరింత చురుకైన సేవలు అందించాలని, అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేషన్ అధికారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదేశించారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కో ఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు, కమిషనర్ ఆర్.శ్రీ రాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు పాల్గొన్న ఈ సమావేశంలో ముందుగా ఇంజినీరింగ్ విభాగం అధికారులతో చర్చించారు. ఆ తర్వాత ప్రజారోగ్య విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, 61వ సచివాలయం విషయాలపై సమీక్ష చేపట్టారు. ప్రస్తుతం నగరంలో జరుగుతున్న ప్రగతిపై ఆరా తీశారు. నగరంలో వీధి దీపాల మరమ్మతులను 48 గంటల్లో పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఈ విషయంలో ప్రజా భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమన్నారు. ప్రస్తుతం నగరంలోని ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేశామని, వాటి నిర్వహణకు ప్రజల సహకరించాలని కోరారు. పారిశుధ్యపరంగా మరింత మెరుగైన ఫలితాలు రాబట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తడి, పొడి చెత్తలను వర్గీకరించి అందివ్వడంలో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులే కాకుండా ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్న అభిప్రాయపడ్డారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అనేక సమస్యలను పరిష్కరించి టెండర్లు పిలిచి పనులు పూర్తయ్యేవిధంగా చొరవ చూపాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న కృషిలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నామని తెలిపారు. అలాగే ఈ మధ్యనే ప్రారంభించిన మహిళా పార్కులో అంచనాలకు మించి సందర్శకులు వస్తుండడంతో క్రీడా సామగ్రి పాడైందని, ఈ నేపథ్యంలో పదిరోజుల పాటు పార్కును మూసివేస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా మహిళల కోసం ప్రత్యేకంగా పార్కును నెలకొల్పిన ఘనత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికే దక్కుతుందన్నారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి రహిత సంక్షేమ పాలన



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అవినీతి రహిత సంక్షేమ పాలన కొన సాగుతోందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గరివిడి మండలంలోని శేరీపేట గ్రామంలో బుధవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జెడ్పీ చైర్మన్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. అంతకుముందు నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో శేరీపేట గ్రామస్తులకు రూ.7.80 కోట్లు ఆర్థిక సాయం అందించామని వివరించారు. అచ్చుతాపురం జంక్షన్ నుంచి శేరీపేట మీదుగా దువ్వాం వరకు తారురోడ్డు నిర్మించామని చెప్పారు. ప్రతీ సచివాలయంలో పరిధిలో తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నారని, ఈ నిధులతో గ్రామంలో అవసరమైన పనులు చేయిస్తామని తెలిపారు.

అన్ని వర్గాలకూ న్యాయం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన, మధ్యతరగతి వర్గాల ప్రజలందరికీ న్యాయం జరుగుతోందని, వివిధ పథకాల రూపంలో ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందించి, వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని జెడ్పీ చైర్మన్ చెప్పారు. అర్హతే ప్రామాణికంగా ప్రతీ కుటుంబానికి పథకాలు అందిస్తున్నామని తెలిపారు. సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు అందుతున్నాయని, ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మో హన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షనాయకుడు చంద్రబాబునాయుడుతో పాటు ఆ పార్టీ నాయకులు, తమ ఎల్లో మీడియా ద్వారా ప్రభుత్వంపై రోజూ దుష్ప్రచారాలు చేయిస్తున్నారని, ఆ ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ఎంపీడీఓ జి.భాస్కరరావు, తహసీల్దార్ టి.గోవింద్, స్థానిక నాయకులు పిల్ల ఆదినారాయణ, జమ్ము కృష్ణ, పెద్ద గురువులు, తోట రవి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, కోనూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, అర్తమూరు సర్పంచ్‌పొన్నాడ కుమార్, పలు పంచాయతీల సర్పంచులు,ఎంపీటీసీలు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లు పాల్గొన్నారు.

లంచాలు, అవినీతికి తావులేదు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: లంచాలు, అవినీతి, దళారీ వ్యవస్థకు తావులేకుండా, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తు న్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి మెట్టకాలనీలో బుధవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం ' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, ఆయా పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను ఆరా తీశారు. పథకాల మంజూరుకోసం ఎవరైనా లంచాలు అడుగుతున్నారా అని ప్రజలను ప్రశ్నించగా... అవినీతి, లంచాలు లేవని లబ్ధిదారులు స్పష్టం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలకు, దళారులకు లంచాలు ఇవ్వనిదే పథకాలు అందేవి కాదని, పనులు జరిగేవి కావని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాలు, ప్రభుత్వ సేవలు గ్రామాల్లోనే అందేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు, కొసిరెడ్డి రమణ, గిరిడ రాందాసు, మజ్జి శంకర్, తాడేల ఉమ, డీజే, బలగ రమేష్, కరణం ఆది తదితరులు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

'ఫ్యామిలీ డాక్టర్'పై అవగాహన కల్పించండి

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో పర్యటన



కాటకాపల్లిలో 'ఫ్యామిలీ డాక్టర్' శిబిరంలో గర్భిణులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కొత్తవలస: 'ఫ్యామిలీ డాక్టర్' విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, గ్రామాల వారీగా షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచించారు. కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో అధికారులతో కలిసి బుధవా రం ఆమె పర్యటించారు. కొత్తవలస మండలం కాట కాపల్లి గ్రామంలో 'ఫ్యామిలీ డాక్టర్' వైద్య శిబిరాన్ని సందర్శించారు. కొత్తవలస పీహెచ్‌సీకి చెందిన ఒక వైద్యురాలు ప్రసూతి సెలవులో ఉండగా, మరొక వైద్యురాలు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరానికి హాజరైనట్లు కలెక్టర్ దృష్టికి వచ్చింది. దీంతో పీహెచ్‌సీలో ఎవరు వైద్యసేవలు అందిస్తున్నారని శిబిరంలో ఉన్న వైద్యాధికారిని కలెక్టర్ ఆరా తీయగా... ప్రస్తుతం ఎవరూ లేరని తెలిపారు. కలెక్టర్ వెంటనే ఫోన్‌లో డీఎంహెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడారు. ఎక్కడైనా వైద్యులు సెలవుపై వెళ్తే ఆయా ఆస్పత్రుల్లో వైద్యసేవలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే కంటకాపల్లి సచివాలయాన్ని సందర్శించారు. అనంతరం కొత్త వలస ఉన్నత పాఠశాలలోని జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. కేంద్రానికి చేరుకున్న విద్యాకానుక కిట్ల వివరాలపై అధికారులను ఆరా తీశారు. కిట్ల నాణ్యతను పరిశీలించిన తర్వాతే విద్యా ర్థులకు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం బలిఘట్టాంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. నిమ్మలపాలెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. లక్కవరపుకోట మండలంలోని గంగుబూడి ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు. నాడు–నేడుకు ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి చేయించాలని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. రంగాపురంలో జగనన్న లేవుట్ పనులను, సంతపేటలో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఎల్.కోట సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయం పరిధిలో రెవెన్యూ పనులు పెండింగ్‌లో ఉండడంతో సిబ్బంది తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన రైతులకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం కొట్యాడ సచివాలయాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, పంచాయతీరాజ్, హౌసింగ్ డీఈలు, కొత్తవలస, ఎల్.కోట తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, కొత్తవలస ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ తదితరులు ఉన్నారు.